సాక్షి
కుమురం భీం

బుధవారం ׀ 15 ׀ నవంబర్ ׀ 2023



ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో నుంచి జిల్లా ఎన్నిల అధికారి వరకు కీలకంగా వ్యవహరిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన నుంచే వీరిది ముఖ్యపాత్ర.

10లో▸



దుమ్ము, ధూళితో తిప్పలు

కౌటాల మండలం ముత్తంపేట శివారులోని స్టోన్ క్రషర్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పచ్చని పంటలు దుమ్ము, ధూళితో దెబ్బతింటున్నాయి.

11లో▸

గరిష్ఠం/కనిష్ఠం 32.4/19.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. పగలు ఎండగా ఉంటుంది. రాత్రి చల్లబడుతుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ సురేశ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారుడితోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న వారిని మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న మనోరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్న కృష్ణతేజ జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21న పంజాబ్‌లో జరిగే పోటీల్లో కృష్ణతేజ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ సారంగపాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌బాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికైన విద్యార్థినులతో డీటీడీవో, డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటాలని డీటీడీవో రమాదేవి, డీఈవో అశోక్ అన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలకు చెందిన ఎనిమిది మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 15 నుంచి 17 వరకు మెదక్ జిల్లా తుఫ్రాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, శిక్షకుడు తిరుమల్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత



వేడుకలో టీచర్లు, విద్యార్థులు, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శారద అన్నారు. మండలంలోని మోడి కేజీబీవీలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం వాటిల్లితే హెల్ప్‌లైన్ నంబర్ 1098కి సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ గురించి జెండర్ స్పెషలిస్టు రాణి వివరించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ చిల్డ్రన్ కౌన్సిలర్ చంద్రశేఖర్, జమున, ఎస్‌వో మీనా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఈ నెల 18న ఉదయం 9 గంటలకు నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ కుల సంఘాల జాతీయ సదస్సు జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జాతీయ సదస్సుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సభకు హాజయ్యేవారు నల్లప్యాంటు, తెల్లచొక్కాతో రావాలని, డ్రెస్‌కోడ్ లేనివారిని సదస్సులోకి అనుమతించరని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగల విశ్వరూప సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడాన్ని మాదిగ జాతి అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తే ప్రధానికి రుణపడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

సిర్పూర్.. గరం గరం

- నియోజకవర్గంలో వేడెక్కుతున్న రాజకీయం
- పోటాపోటీగా పార్టీ శ్రేణుల ప్రచారం
- బీఆర్‌ఎస్, బీఎస్పీ కార్యకర్తల మధ్య బాహాబాహీ
- కేసులు పెట్టుకునే వరకు వెళ్లిన వ్యవహారం
- పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు



సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో శాసనసభ ఎన్నికలు సెగ పుట్టిస్తున్నాయి. మరీ ముఖ్యంగా సిర్పూర్ బరిలో నిలిచిన బీఆర్‌ఎస్, బీఎస్పీ అభ్యర్థులు 'నువ్వా- నేనా' అన్నట్లు సిగపట్లకు దిగుతుండటంతో నియోజకవర్గంలో పలుచోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రచారంలో భాగంగా ఇరు పార్టీల శ్రేణులు బాహాబాహీకి దిగుతుండటం ఘర్షణకు దారితీస్తోంది. అభ్యర్థులు ఏకంగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే స్థాయికి వెళ్లడంతో ఈ పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయోనని రాజకీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

రాష్ట్రంలోనే వరుస పరంగా నంబర్- 1 నియోజకవర్గమైన సిర్పూర్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల మధ్య చతుర్ముఖ పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గంలో ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేరు కోనప్ప నాలుగోసారి బరిలో ఉన్నారు. రావి శ్రీనివాస్, పాల్వాయి హరీశ్‌బాబు, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. కాగా.. 2014లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో కోనేరు కోనప్ప బీఎస్పీ తరఫున ఎన్నికల్లో నిలబడి గెలిచి.. బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు అదే బీఎస్పీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్(ఆర్‌ఎస్పీ) కోనప్పకు పోటీగా నిలబడ్డారు. కోనప్పను కచ్చితంగా ఓడించి తీరుతానని ఆర్‌ఎస్పీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. చాపకింద నీరులా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఎస్పీ దూసుకెళ్లేలా ప్రణాళికలు రచించారు. గ్రామం, మండలం, పట్టణం.. ఇలా ఇంటింటా తిరుగుతూ అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఒక దశలో 'కోనేరు కోనప్ప.. కలప దొంగ' అంటూ మీడియా ముందు తీవ్ర ఆరోపణలు చేయడం.. అందుకు కౌంటర్‌గా కోనప్ప 'మర్డర్లు చేసిన ఘనత మాకే ఉంది. ఎన్‌కౌంటర్లు కూడా మేమే చేపించాం. పరిటాల రవిని మేమే చంపించాం. బెల్లంపల్లి, కరీంనగర్‌లో హత్యలు మేమే చేపించాం. ప్రవీణ్‌కుమార్ ఒక పొలిటికల్ టూరిస్ట్' అంటూ ఆర్‌ఎస్పీపై ప్రత్యారోపణలు చేశారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పార్టీ శ్రేణుల్లో ఘర్షణ వాతావరణం..

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీఎస్పీలకు చెందిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వర్గాలుగా విడిపోయి ప్రచారంలో పాల్గొంటున్నారు. శ్రేణుల ప్రచారం తారస్థాయికి చేరడమే కాకుండా పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నెల 11న కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో బీఎస్పీ కార్యకర్త షేక్ ఆసిఫ్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు కోనేరు ఫణితోపాటు పలువురు ఆకారణంగా దాడిచేయడమే కాకుండా చంపుతామని బెదిరించినట్లు ఆరోపిస్తూ బాధితుడు ఆసిఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల పోలీసులు ఫణితోపాటు పలువురిపై కేసు సైతం నమోదు చేశారు. ఇక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆయా పార్టీల్లో ఉన్న అసంతృప్తులకు అభ్యర్థులు గాలం వేస్తుండటం.. భారీ ఆర్థిక ప్యాకేజీలు ఇచ్చి తమ వైపు తిప్పుకోవడం పరిపాటిగా మారింది. పార్టీ ఫిరాయింపులు గెలుపోటములపై ప్రభావం చూపుతుండటంతో అభ్యర్థులు దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఫలితంగా ప్రచారంలో ప్రత్యర్థులపై దాడులకు దిగడానికి సైతం వెనుకాడకపోవడంతో నియోజకవర్గంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆదివారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయబస్తీలో ఇరు పార్టీల శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ ప్రచార రథం డ్రైవర్‌పై దాడి చేశారంటూ ఆ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం.. తమ ప్రచారాన్ని అడ్డుకోవడమే కాకుండా అన్యాయంగా కేసు పెట్టారని నిరసన తెలుపుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్పీ కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో బైఠాయించారు. పోలీసులు చివరకు ఇరువర్గాల అభ్యర్థులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడంతో పరిస్థితులు సద్దుమణిగాయి. అయితే ఇలాంటివి పునరావృతమైతే మాత్రం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం పోలీసులకు సవాలుగా మారనుంది.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి

ఆసిఫాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రతీ కేంద్రంలో ర్యాంప్ ఏర్పాటు చేసి, వీల్‌చైర్ అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ హేమంత్ బోర్కడే, సిర్పూర్ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, వసతులు కల్పించినట్లు వివరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు, పోలింగ్ రోజు వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్‌కు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అల్పాహారం సక్రమంగా అందించాలి



చిన్నారి విద్యా సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

రెబ్బెన(ఆసిఫాబాద్): అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం సక్రమంగా అందించాలని ఆర్‌జేడీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేకులగూడ, సోనాపూర్, కైరిగాం, వంకులం ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమంపై ఆరా తీశారు. 'విద్యార్థులకు సూక్ష్మ సామర్థ్యాల బోధన ఏవిధంగా జరుగుతోంది' అనే అంశాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యా సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీఈబీ కార్యదర్శి వెంకటేశ్వరస్వామి, ఎంఈవో వెంకటేశ్వరస్వామి ఉన్నారు.

'జిల్లా కేంద్రంలో ఆగని భూకబ్జాలు'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో భూకబ్జాలు ఆగడం లేదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. భూమాఫియాను జిల్లా యంత్రాంగం పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఐకేపీ వీవోఏ భవన స్థలం, కాలువలను ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పురుషోత్తం, రాజ్‌కుమార్, నిఖిల్, శివ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు అలరించాయి. డీఈవో మాట్లాడుతూ కళోత్సవ్ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 95 మంది 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో జానపద నృత్యం, గీతాలు, సంగీతం, శాస్త్రీయ నృత్యం, మ్యూజిక్, మెలోడి, విజువల్ ఆర్ట్ (2డీ, 3డీ), దేశీయ ఆటలు, బొమ్మలు, డ్రామా యాక్టింగ్‌లో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన వారు ఈ నెల 15, 16న హైదరాబాద్‌లోని సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్, రాధాకృష్ణ, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోజన వసతి

విద్యార్థులు, ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఉబెడ్ బిన్ యాహియా, కార్యదర్శి శంకర్, వెంకన్న, నాంపెల్లి శంకర్, సభ్యులు రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు, పక్కన కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ రంజన్, వ్యయ పరిశీలకులు మహిపాల్, పోలీసు పరిశీలకులు చౌదరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి నోడల్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థులు ఎప్పటికప్పుడు తమ ఖర్చును సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. విధుల్లో ఉండే అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. బీఎల్‌వోల ద్వారా ప్రజలను చైతన్యపర్చి ఓటింగ్ శాతం పెంచాలని ఆదేశించారు. సైబర్ సెక్యూరిటీలో భాగంగా జిల్లా వెబ్‌సైట్ నవీకరణ, సీటీవ పనితీరు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు సాంకేతిక మద్దతు అందిస్తామన్నారు. సెక్టర్ అధికారులను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు జీపీఎస్‌తో కూడిన వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే ఓటింగ్ యంత్రాలను జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కేటాయించామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించి పత్రికలు, చానళ్లలో ప్రదర్శిస్తున్న ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను నిరంతరం పర్యవేక్షించి, నివేదికలు రూపొందిస్తున్నామన్నారు. ఖర్చుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడికే ఓటు

- ప్రజలకు అందుబాటులో ఉండాలి..
- సమస్యలు పరిష్కరిస్తూ.. అభివృద్ధికి పెద్దపీట వేయాలి
- యువ ఓటర్ల మనోగతం

యువనాడి

కౌటాల(సిర్పూర్): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటరు జాబితాలో యువ ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇందులో చాలా మంది మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అభ్యర్థుల గెలుపులో వీరి ఓట్లే కీలకం కానున్నాయి. ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ.. అభివృద్ధికి పెద్దపీట వేసే వారికే ఓటు వేస్తామని యువత అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. అవినీతిని దరిచేరనీయకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించాలని వారు కోరుకుంటున్నారు. నిస్వార్థ సేవ చేస్తూ.. విద్య, వైద్యం, రవాణా మెరుగుపర్చాలంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో యువ ఓటర్లతో 'సాక్షి' ముచ్చటించింది.

వయస్సుల వారీగా ఓటర్లు

వయస్సు	సిర్పూర్	ఆసిఫాబాద్	మొత్తం
18- 19	8,318	9,626	17,944
20- 29	47,205	57,957	10,5162
30- 39	57,550	64,140	12,1690
40- 49	45,321	40,479	85,800
50-59	34,061	28,198	62,259
60- 69	20,897	16,401	3,7298
70- 79	10,083	7,471	17,554
80పైన	3,489	2,392	5,831



విద్యావంతులకే ఓటు



విద్యకు ప్రాధాన్యతనిచ్చే విద్యావంతులైన అభ్యర్థికే ఓటు వేస్తా. బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో యువతులు చదువుకుని ఎలాంటి ఉపాధి లేకుండా ఉంటున్నారు. వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి.

– ఎస్.మౌనిక, యాపలగూడ, మం.కౌటాల

సమస్యలు తెలుసుకోవాలి



ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవ చేయాలి. ప్రతినెలా గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి. వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలి. క్రీడలు, చదువులకు సహకరించాలి. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన ఉండాలి.

– ముదిగొండ దక్షిణామూర్తి, ఆసిఫాబాద్

మైదానం ఏర్పాటు చేయాలి



సిర్పూర్ నియోజకవర్గ కేంద్రంలో క్రీడామైదానం లేదు. ఆటల పోటీలు నిర్వహించడానికి ఇబ్బంది పడుతున్నాం. వాకింగ్, రన్నింగ్ చేయలేకపోతున్నాం. యువత సైతం క్రీడలకు దూరంగా ఉంటున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వారు సిర్పూర్‌లో క్రీడామైదానం ఏర్పాటు చేయాలి.

– నులిగొండ రాజశేఖర్, సిర్పూర్(టి)

మెరుగైన వైద్యం అందించాలి



జిల్లాలో చాలా వరకు ఆదివాసీ, గిరిజన గ్రామాలే. మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన వైద్యం అందడం లేదు. ముఖ్యంగా గర్భిణులు అవస్థలు పడుతున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. యువతులకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలి.

– పిన్న సాత్విక, ఆసిఫాబాద్

నిజాయతీపరులకే ఓటు



నిజాయతీపరులైన రాజకీయ నాయకులకే ఓటు వేస్తా. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయని వారికి బుద్ధి చెబుతాం. దహెగాం మండలానికి ఇప్పటికీ సరైన రోడ్డు వ్యవస్థ లేదు. పెద్దవాగుపై వంతెన కూలడంతో ఏడాదిగా పడరానిపాట్లు పడుతున్నాం. దహెగాం మండలం సమస్యలు పరిష్కరించాలి.

– రాజు, దహెగాం

ఉద్యోగావకాశాలు పెంచాలి



ఏళ్లుగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరం. ఉన్నత చదువులు చదివినా ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నా. పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చేవారినే ఎన్నుకుంటాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు పెంచాలి.

– వడ్లూరి విలాస్, వాంకిడి

అభివృద్ధి పనులు చేపట్టాలి



గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే వారికే నా ఓటు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదు. గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు, రవాణా, విద్య, వైద్యం సౌకర్యాలు మెరుగుపర్చాలి.

– గొడిసెల అముల్, ఖమాన, మం.వాంకిడి

కళాశాల ఏర్పాటు చేయాలి



నూతనంగా ఏర్పడిన పెంచికల్‌పేట్ మండలంలో జూనియర్ కళాశాల లేదు. విద్యార్థులు ఉన్నత చదువులకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కళాశాల లేక చాలా మంది విద్యార్థినులు మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. పెంచికల్‌పేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

– ఎనగందుల తిరుపతి, పెంచికల్‌పేట్

పార్టీలు మారొద్దు



ఎన్నికల్లో గెలిచిన అనంతరం అభ్యర్థులు పార్టీలు మారొద్దు. ఏ పార్టీ నుంచి గెలిస్తే చివరివరకు అందులోనే కొనసాగాలి. పార్టీ మారితే సదరు ఎమ్మెల్యే శాసన సభ సభ్యత్వం రద్దు చేయాలి.

– దుర్గం మల్లేశ్, గంగాపూర్, మం.చింతలమానెపల్లి

క్లుప్తంగా

ఆసిఫాబాద్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నరేందర్


నరేందర్

మంచిర్యాలటౌన్: ఐఎన్టీయూసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాలకు చెందిన రాంశెట్టి నరేందర్‌ను ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

బీజేపీకి 'జాడి' రాజీనామా


రాజీనామా పత్రం చూపుతున్న ఏసయ్య

జైపూర్(చెన్నూర్): బీజేపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీపీ జాడి ఏసయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నప్పటికీ సముచితమైన స్థానం కల్పించలేదని, పార్టీ వ్యవహారాలు నచ్చకనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మద్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరలబంగ్లాస్ ఏరియా వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఒకరు మద్యం బాటిళ్ల కాటన్‌తో వెళ్తూ కనిపించాడు. ఆపేందుకు ప్రయత్నిస్తుండగా బైక్ వదిలేసి పారిపోయాడు. పట్టుకున్న మద్యం విలువ రూ.16 వేలు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. మందు బాటిళ్లను స్వాధీనం చేసుకుని బైక్ నంబర్ ఆధారంగా చిర్రకుంట సర్పంచ్ కొమురయ్యపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బంకర్ వద్ద షేక్ ఖలీల్ అనే వ్యక్తి గంజాయి దమ్ము కొడుతూ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద 135 గ్రాముల గంజాయి లభించింది. బల్లార్షా నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నట్లు నింఅంగీకరించాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం..

- బీఎల్‌వో నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు
- ఓటరు జాబితా తయారీ మొదలు ఫలితాల వరకు

జంగ్ తెలంగాణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో నుంచి మొదలు జిల్లా ఎన్నిల అధికారి వరకు అంతా కీలకం. ఓటరు జాబితా మొదలు ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఈ అధికార యంత్రాంగం శ్రమ అంతాఇంతా కాదు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మొత్తం ఈ అధికారులపాత్రే ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి..

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని సిబ్బందికి శిక్షణ, ఎన్నికల కార్యక్రమాల పూర్తిస్థాయి పర్యవేక్షణ, నిత్యం సమీక్ష జరుపుతూ మార్గదర్శనం చేస్తారు. అంతేకాదు ఎన్నికల విధులు బాధ్యాతాయుతంగా, ప్రశాంత వాతావరణంలో సాగేలా పర్యవేక్షిస్తారు. మొత్తంగా ఓటరు జాబితా తయారీ నుంచి మొదలు ఓట్ల లెక్కింపు వరకు జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్‌దే పూర్తి బాధ్యత.

బీఎల్‌వోలు..

గ్రామ, పట్టణ స్థాయిల్లో పనిచేసే వారు బీఎల్‌వో (బూత్ స్థాయి అధికారి)లు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో పేరు నమోదు, తప్పులు, సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులు.. ఇలా అన్ని బాధ్యతలు బీఎల్‌వోలు నిర్వర్తిస్తారు. ఓటరు జాబితా తయారీలో అధికారుల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవకతవకలు లేని ఓటరు జాబితా తయారీలో కీలకంగా వ్యవహరిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి..

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో) ఉంటారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి సమకూర్చే బాధ్యత పీవోకు ఉంటుంది. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ప్రిసైడింగ్ అధికారిదే. ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు పర్యవేక్షిస్తారు. వీరికి అదనపు ప్రిసైడింగ్ అధికారి సహాయంగా ఉంటారు. వీరితో పాటు మరో ముగ్గురు పోలింగ్ అధికారులు కూడా ఉంటారు. వీరంతా ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును చూడాల్సిన బాధ్యత వీరిదే.

రిటర్నింగ్ అధికారి..

ప్రతీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) ఉంటారు. ఎన్నికల సంఘం వీరిని నియమిస్తుంది. వీరు ఆ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ మొదలు నామినేషన్ పరిశీలన, తిరస్కరణ, అభ్యంతరాలు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అంతా వీరి చేతుల్లో ఉంటుంది. ఇక ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అంతా వీరు చూస్తారు.

సెక్టోరియల్ అధికారి..

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంలో సెక్టోరియల్ అధికారి పాత్ర ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయడం, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ముఖ్యపాత్ర పోషిస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తారు. పోలింగ్ కేంద్రంతో పాటు పోలింగ్ జరిగే పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూస్తారు. పోలింగ్ సమయాల్లో ఆయన పర్యవేక్షించే పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా సెక్టోరియల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ భూమి దురాక్రమణ

- పట్టించుకోని అధికారులు

బెల్లంపల్లి: పట్టణంలో భూకబ్జాల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిని ఆక్రమించేస్తున్నారు. బెల్లంపల్లి నుంచి గురిజాలకు వెళ్లే మార్గంలో ఐటీడీఏ ఉద్యానవన శాఖ ముందున్న ప్రభుత్వ స్థలం రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కబ్జాకు సిద్ధం చేశారు. ప్రధాన రహదారిని ఆనుకుని స్మశాన వాటిక పక్కనున్న అరెకరం స్థలాన్ని కబ్జా రాయుళ్లు ఆక్రమించుకున్నారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ శివారు సర్వే నంబర్ 170లో ఉన్న విలువైన భూమిని ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

రాత్రి చదును చేసి.. ముళ్ల కంచె వేసి..

కబ్జా అయిన భూమిని రాత్రికి రాత్రే ట్రాక్టర్‌తో దున్నించి చదును చేయించి అడ్డంగా ముళ్ల కంపవేశారు. ఆక్రమిత భూమి పక్కన కూతవేటు దూరంలో నేతకాని, మన్నెవార్, కొలవార్ సంఘాల భవనాలకు కేటాయించిన భూమి ఉంది. ఆపక్కనే ఉన్న ఖాళీ స్థలాన్నీ అక్రమార్కులు కబ్జా చేశారు.


అక్రమార్కులు చదును చేసిన ప్రభుత్వ భూమి

దృష్టి సారించని అధికారులు

ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. అంతేకాకుండా ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు భూకబ్జాకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.3.75 లక్షల నగదు స్వాధీనం


నగదు అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో బన్సీలాల్

బెల్లంపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకెళ్తున్న ఇరువురి వద్ద నుంచి రూ.3.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మంగళవారం కన్నాల హైవే చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కన్నాల బస్తీకి చెందిన తెల్ల సతీష్ రూ.1.75 లక్షలు, ఇంక్‌లైన్ బస్తీకి చెందిన గొట్టె రాజనర్సు రూ.2 లక్షల నగదు తీసుకెళ్లా పట్టుబడ్డారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల ఎఫ్ఎస్‌టీ టీమ్ అధికారి సురేఖకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో ప్రకటించారు.

యువకుడు ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖర్జవెల్లి గ్రామానికి చెందిన ఎల్కరి తిరుపతి (25) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులకు విషయం తెలపడంతో సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి మంచిర్యాల జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అందించే ప్రతిభా పురస్కారాల అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ మంచిర్యాల రీజియన్ అధ్యక్షుడు ఆర్ముల్ల రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరంలో సామాజిక సేవారంగం, క్రీడారంగం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ, పట్టణ అభివృద్ధి, సాహిత్యం, రచనలు, కవులు, కళాకారులకు, విద్యా వైద్యం రాజకీయ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారు ఈ నెల 30లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో సులభ్ కాంప్లెక్స్ పక్కనున్న గండికోట రవికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి సమీపంలోని చెత్తను తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పూర్తిగా దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు రూ.పదివేలు, బీఆర్ఎస్ నాయకులు రూ.20 వేలు సాయం అందించారు.


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

'అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్ విజయవంతం చేయాలి'


మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మెల్ అకాడమీ డైరెక్టర్ జేవియర్ రెక్స్ కోరారు. మంగళవారం పాఠశాల ఆవరణలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మెల్ హైస్కూల్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 40 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ జేవియర్ రెక్స్

పే...ద్ద సీతాకోక చిలుక

కెరమెరి: మనం ఇప్పటి వరకు చిన్నచిన్న సీతాకోక చిలుకలను మాత్రమే చూశాం. కానీ ఇక్కడ కనిపించే సీతాకోకచిలుక ఏకంగా పదించుల పొడవు, నాలుగించుల వెడల్పు ఉంది. కెరమెరి మండల కేంద్రంలోని సద్గురు(విష్ను) మెడికల్ షాపులో మంగళవారం రాత్రి ఎగురుతూ వచ్చింది. కౌంటర్‌పై ఉన్న గ్రీన్ గ్రాస్ మ్యాట్‌పై రెక్కలు విప్పి కూర్చుని ఏకంగా 12 గుడ్లను వేసింది. గోధుమరంగులో ఉన్న ఈ సీతాకోక చిలుక రెక్కలు ఎంతో అందంగా ఉన్నాయి. రెక్కలపై ప్లస్ ఆకారంలో నల్లటి బొట్లు ఉన్నాయి. విషయం తెలుసుకున్న పట్టణవాసులు ఆసక్తిగా తిలకించారు.


సీతాకోకచిలుక గుడ్లు


సీతాకోక చిలుక

ఎమ్మెల్యే కోనప్పకు నిరసన సెగ

- ప్రచారాన్ని అడ్డుకున్న చిన్నగుడిపేట గ్రామస్తులు
- గత హామీలు అమలు చేయలేదని నిరసన


కోనప్పను అడ్డుకుంటున్న గ్రామస్తులు

భీమిని/దహెగాం: మంచిర్యాల జిల్లా భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి మంగళవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన సిర్పూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు నిరసన సెగ తగిలింది. గత ఎన్నికల్లో రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు వేయించలేదని గ్రామస్తులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు బైక్‌లను తొలగించినప్పటికీ ప్రచారం చేయకుండా గ్రామస్తులు అడ్డుపడడంతో కోనప్ప చేసేదేంలేక అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామంలోని పలువురు యువకులు వీడియో తీస్తుండగా ఎమ్మెల్యే గన్‌మెన్‌లు సెల్‌ఫోన్‌లు లాక్కుని వీడియోలు డిలీట్ చేశారు.

అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలు

భీమిని(బెల్లంపల్లి): జిల్లాలు, మండలాల విభజనతో సిర్పూర్ నియోజకవర్గం నుంచి కొన్ని గ్రామాలు బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండలంలో విలీనమయ్యాయి. భీమిని మండలంలోని చిన్నగుడిపేటలో 1319 మంది ఓటర్లు ఉండగా, కేస్లాపూర్‌లో 859, చిన్నతిమ్మాపూర్‌లో 561, కన్నెపల్లి మండలంలోని సాలిగాంలో 560, మాడవెల్లిలో 730 మంది ఓటర్లు కలిగిన గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో పరిపాలన పరంగా బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి జరుగుతుండగా ఆయా గ్రామాల ప్రజలు ఓట్లు మాత్రం సిర్పూర్ నియోజకవర్గానికి వేయాల్సి వస్తోంది. దీంతో రెండు నియోజకవర్గాల మధ్య గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదు. గ్రామాల్లో ప్రధానంగా రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు లేవంటూ ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు ఏ అధికారికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని వాపోతున్నారు. నియోజకవర్గాల విభజన జరిగితే తప్పా ఆయా గ్రామాల ప్రజల సమస్య తీరేలా లేదు.

11వ వేతన ఒప్పందాలపై ఉత్తర్వులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గుగని కార్మికులకు సంబంధించిన 11వ వేతన ఒప్పందం అమలుకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొందని ఏఐటీయూసీ వేజ్‌బోర్డు కమిటీ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జేబీసీసీఐ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో వేజ్‌బోర్డులో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎల్టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవులకు సంబంధించి ఒప్పందాలను అమలు చేయడానికి ఉత్తర్వులను విడుదల చేస్తామని యజమాన్యం ఒప్పుకుందన్నారు. అంతేకాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు పెంచడానికి కమిటీ ఏర్పాటు చేస్తారన్నారు. కార్మికులకు వైద్యానికి సంబంధించిన సీపీఆర్ఎంఎస్ అమలు, లోపాల సవరణ కోసం కమిటీ ఏర్పాటు చేయడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు, మిగులు క్వార్టర్లను కార్మికులకు అమలు చేయడం అంశంపై చర్చించడానికి కూడా కమిటీ ఏర్పాటుకు యజమాన్యం అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్ని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పేట్‌మహెలా కాలనీకి చెందిన పత్తి శంకర్ (57) మంగళవారం ఉదయం వాకింగ్ చేసేందుకు రైల్వేస్టేషన్ ప్రాంతానికి వచ్చాడు. రైలుపట్టాలు దాటి బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని భార్య పత్తి పుష్పలతకు మృతదేహం అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కాసిపేట(బెల్లంపల్లి): ఈ నెల 15, 16 తేదీలలో హైదరాబాద్‌లోని సీసీఆర్టీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి తెలిపారు. టాయ్స్ అండ్ గేమ్స్ బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని బిందుప్రియ, బాలుర విభాగంలో 9వ తరగతికి చెందిన జి.నరేందర్, సాంప్రదాయ ఇన్స్ట్రుమెంటల్ బాలికల విభాగంలో పదో తరగతికి చెందిన అఖిల, సోలో డ్రామా బాలుర విభాగంలో 9వ తరగతికి చెందిన శివకుమార్ ఎంపికయ్యారు. ఈనెల 9న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు, గైడ్ టీచర్‌ను ఎంఈవో ప్రభాకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేతన బకాయిలు ఇప్పించాలని వినతి

పాతమంచిర్యాల: తమకు వేతన బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ శాలీవాహన పవర్ ప్లాంట్ కార్మికులు మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ శాలీవాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ విద్యుత్ ప్లాంట్ గతేడాది డిసెంబర్ 6న మూసివేసిన యాజమాన్యం అప్పటి నుంచి కార్మికులకు రావాల్సిన ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. ప్లాంట్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలు ఫ్రీజింగ్‌లో ఉన్నాయని ఫ్రీజింగ్ ఎత్తేసిన తర్వాత కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్‌లు ఇస్తామని యాజమాన్యం రాతపూర్వకంగా రాసి ఇచ్చిందన్నారు. బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్ ఎత్తేసిన తర్వాత కార్మికులకు సమాచారం ఇవ్వకుండానే యాజమాన్యం డబ్బులు డ్రా చేసి వాడుకుందన్నారు. కార్మికులకు రావాల్సిన ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్స్ ఇచ్చిన తర్వాతే స్క్రాప్, మెషినరీ తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దూరి రాజుయాదవ్, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, నిమ్మరాజల సత్యనారాయణ, సగ్గుర్తి ఆనందరావు, రావుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఓటుహక్కు వినియోగించుకోవాలి

కాసిపేట/కోటపల్లి/వేమనపల్లి: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి, కాసిపేటలో పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి కాసిపేట వరకు నిర్వహించిన కార్యక్రమంలో 70మంది పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ఉమెన్ బెటాలియన్ ఫోర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో ఎంపఅలీం, కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు గంగారాం, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో..

కోటపల్లి మండల కేంద్రం, వేమనపల్లి మండలం నీల్వాయిలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ మోహన్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్, టౌన్ సీఐలు విద్యాసాగర్, వాసుదేవరావు, ఎస్సైలు సుబ్బారావు, సురేష్, పాల్గొన్నారు.


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ, సీఐలు

పోలీసులపై దాడి కేసులో నిందితులకు జైలు

లక్ష్మణచాంద(నిర్మల్): పోలీసులపై దాడి కేసులో ఇద్దరు నిందితులకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మణచాంద గ్రామంలోని వైన్‌షాప్ వద్ద 2016 ఏప్రిల్ 14న ఇదే గ్రామానికి చెందిన పత్తిపాక గంగన్న, ఎద్దండి ముత్తన్న మద్యం కొనుగోలు చేశారు. మద్యం విక్రయించిన దిలీప్‌తో వాగ్వాదానికి దిగగా.. అతడు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అప్పటి హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్‌గౌడ్, కానిస్టేబుల్ గంగయ్య అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిందితులు పోలీసులపై దాడి చేసి దూషించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో జి.రామకృష్ణ తొమ్మిది మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి నిందితులు గంగన్న, ముత్తన్నలకు మూడు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.